వెలవెలబోతున్న రైతు బజార్లు

- కూరగాయల ధరలకు రెక్కలు
- భీమవరం రైతు బజార్‌లో ఆది, బుధవారాలే అమ్మకాలు
- బహిరంగ మార్కెట్, రైతు బజార్ ధరలకు పెద్ద తేడా లేదు



కూరగాయల దుకాణాలు లేని భీమవరం రైతు బజార్



భీమవరం రైతు బజార్‌లో మూసివేసిన నిత్యావసర వస్తువుల దుకాణాలు

భీమవరం: తాము అధికారంలోనికి వచ్చిన వెంటనే ధరలను అదుపు చేస్తామని కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోతున్నాయి. కనీసం కూరగాయలను సైతం తక్కువ ధరలకు విక్రయించాలనే ప్రభుత్వ ఆదేశాలను కింది స్థాయి అధికారులు పట్టించుకున్న దాఖలాలు కన్పించడం లేదు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకులతో పోటీ పడి కూరగాయ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలే కాకుండా ధనికులు సైతం ఇవేమి ధరలు బాబోయ్ అంటూ గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వం తక్కువ ధరలకు రైతు బజార్‌లో కూరగాయలు విక్రయిస్తున్నట్లు ప్రతి రోజూ సమాచార శాఖ పత్రికలకు ప్రకటనలు విడుదల చేస్తుంటే రైతు బజార్‌లో కూరగాయల దుకాణాలే కానరావడం లేదని వినియోగదారులు దుమ్మెత్తి పోస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలను తగ్గిస్తామంటూ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి నిత్యావసర వస్తువులతో పాటు, బియ్యం, కూరగాయల ధరలు కూడా ఆకాశన్నంటుతున్నాయి. గతంలో ఉల్లిపాయ కోసే సమయంలో కంటిలో నీళ్లు వస్తే నేడు ధరలు చూస్తేనే నీళ్లు తిరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా ఉల్లిపాయలు కిలో రూ.70 వరకు విక్రయిస్తున్నారు. ఇక కూరగాయలు, ఆకు కూరల ధరలు మండిపోతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించే రైతులకు మద్దతు ధర లేకపోగా మార్కెట్‌లో మాత్రం వ్యాపారులు వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. ధరలను అదుపు చేయాలని వినియోగదారులు అధికారులు, ప్రజా ప్రతి నిధులకు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది.

రైతు బజార్‌లో కూరగాయల దుకాణాల కనుమరుగు

అయితే రైతు బజార్‌లో తక్కువ ధరలకు ఉల్లిపాయలు, కూరగాయల ధరలు విక్రయిస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. అయితే బహిరంగ మార్కెట్ ధరలకు రైతు బజార్‌లో కూరగాయల ధరలకు తేడా లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమవరం రైతు బజార్‌లో ఆది, బుధవారాలు మినహా మిగిలిన రోజుల్లో కూరగాయల దుకాణాలే కన్పించడం లేదని చెబుతున్నారు. రైతులను ప్రోత్సహించకపోవడం వల్లనే రైతు బజార్‌కు రావడం లేదని చెబుతున్నారు.

సమాచార శాఖ సోమవారం విడుదల చేసిన ధరల పట్టిక

టమాట కిలో రూ.48, బీరకాయలు రూ.40, బంగాళా దుంపలు రూ.36, ఉల్లిపాయలు రూ.56, పచ్చిమిర్చి రూ.32, దొండకాయలు రూ.40, క్యాబేజీ రూ.32, వంకాయలు రూ.36, కాకరకాయలు రూ.40, బెండకాయలు రూ.34, దోసకాయలు రూ.40 ధరలు ఉన్నట్లు ప్రకటన విడుదల చేశారు. భీమవరం రైతు బజార్‌కు వెళితే అసలు దుకాణాలే లేవని అక్కడ బియ్యం షాపు తప్ప ఇతర వ్యాపారుల జాడ లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కావాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూ అధికారి చాంబర్‌లో అక్టోబరు 2న గాంధీ జయంతి రోజున నిర్వహించే జిల్లా వ్యాప్త స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల విజయవంతంపై సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలతో జిల్లా రెవెన్యూ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ గాంధీ జయంతి రోజున స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయి ప్రోగ్రాం నిర్వహించుటకు భీమవరం డీమార్ట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జిల్లా కలెక్టర్ నాగరాణి, స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, తదితర ప్రజా ప్రతిథులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, ఇంచార్జి డీఈవో జి.నాగమణి, జిల్లా పంచాయతీ శాఖ అధికారి బి.అరుణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.ఉమా మహేశ్వరావు, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ జిల్లా అధికారి బీవీవీ నాగేశ్వరరావు, పురపాలక సంఘం కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకూడ రంగ సాయి, కంతేటి వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాంధీ జయంతి కార్యక్రమాలు

భీమవరం: జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతి కార్యక్రమాలు అక్టోబర్ 1 నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. 1వ తేది మంగళవారం భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద అహింస ప్రతిజ్ఞ, శాంతి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సేవాతత్పరులకు గాంధీ స్మారక పురస్కారాలు, గాంధీ తత్వంపై జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. 2వ తేదీన ఏలూరు జిల్లా పెదనిండ్రకొలనులో మహాత్మా గాంధీ విగ్రహానికి పాలాభిషేకం, సర్వమత ప్రార్థనలు, గాంధేయవాదులకు పురస్కారాలు అందిస్తామన్నారు. అదే రోజు తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలంలోని మల్లవరం గాంధీ స్మారక కేంద్రంలో గాంధీగీత్ కార్యక్రమం, దాతలకు పురస్కారాలు అందిస్తామన్నారు. ఆయా కార్యక్రమాలకు యువత, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి బాసట

భీమవరం (ప్రకాశంచౌక్): మన పరిశుభ్రత స్వచ్ఛమైన ఆరోగ్యానికి బాసటగా నిలుస్తుందని, నీరు గాలి పరిసరాల పరిశుభ్రత సంపూర్ణ ఆరోగ్యానికి హేతువులని, కాలుష్య రహిత సమాజం మనందరి చేతుల్లోనే ఉందని భీమవరం సెయింట్ మేరీస్ హాస్పటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ తేజ వర్ధన్ అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక, సెయింట్ మేరీస్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేశారు. సిస్టర్ యానిత్, సిస్టర్ సెలీన్, డాక్టర్ రెజ్జి పాల్గొన్నారు.

స్పందనకు సమస్యలపై రెండు అర్జీలు

ఆకివీడు: ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో రెండు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్బారావు చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని మంచినీటి పంట కాలులకు చేర్చి నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువు తవ్వి రొయ్యల చెరువు సాగు చేస్తున్నారని గ్రామానికి చెందిన సూరంపూడి వెంకట రాంబాబు అర్జీ అందజేశారు. తన సర్వీస్ రిజిస్టర్‌లో జాయినింగ్ తేదీని తప్పు రాశారని, 2010లో మెడికల్ లీవు అప్పటి తహసీల్దార్ నమోదు చేశారని, దీనివల్ల సీనియర్ సహాయకుడిగా పదోన్నతి అవకాశం కోల్పోయానని న్యాయం చేయాలని కోరుతూ గుమ్ములూరు-2 రెవెన్యూ అధికారి బందా హరిచ్చంద్ర ప్రసాద్ అర్జీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

భీమవరం: విద్యార్థులు వ్యక్తిగత క్రమశిక్షణ అలవర్చుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని నోయిడాకు చెందిన చిన్మయిమిషన్ అచార్యుడు చిద్రుపానంద స్వామిజీ అన్నారు. సోమవారం భీమవరంలో భారతీయ విద్యాభవన్స్ స్కూల్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ దేవీపద్మ, భీమవరం చిన్మయి అచార్యురాలు ఈశాని మాతాజీ, చిన్మయి మిషన్ ప్రెసిడెంట్ ఎం.శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీతోనే భవిష్యత్

భీమవరం: నూతన టెక్నాలజీ అధ్యయనం ద్వారానే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలుంటాయని సాఫ్ట్‌వేర్ సంస్థ నిపుణుడు ఆదిత్య సుందర్ అన్నారు. సోమవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 10 రోజుల పాటు అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) క్లౌడ్, డేవాప్స్ టెక్నాలజీలపై విద్యార్థులకు అందించే శిక్షణను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కేవీ మురళీ కృష్ణంరాజు, సీఎస్ఈ హెడ్ వి.చంద్రశేఖర్, కో-ఆర్డినేటర్ ఆర్.శివ శంకర్, వి.ప్రియదర్శిని, ఎల్వీ శ్రీనివాస్, సీహెచ్ వినోద్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

పని చేయని సర్వర్.. రేషన్ డీలర్ల అవస్థ



ఉండి ఎమ్ఎల్ఎస్ పాయింట్ వద్ద సర్వర్ పని చేయకపోవడంతో వేచి ఉన్న రేషన్ డీలర్లు

పాలకోడేరు: ఉండి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఈ పోస్ మిషన్ సర్వర్ నాలుగు రోజులుగా పనిచేయడం లేదు. దాంతో వేలిముద్ర వేయడానికి వచ్చిన డీలర్లు గంటల తరబడి వేచివుండి, ఉసూరుమంటూ తిరిగి వెళ్తున్నారు. ఈ గోదాముల పరిధిలో ఆరు మండలాలు ఉన్నాయి. ఉండి, కాళ్ల, ఆకివీడు, భీమవరం రూరల్, అర్బన్, పాలకోడేరు మండలాల నుంచి వేలిముద్రలు వేసేందుకు ఇక్కడికి వస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తే సర్వర్ పని చేయడం లేదని వార్త విని ఇబ్బందులు పడుతూ ఇంటి బాట పడుతున్నారు. పీడీఎస్ రైస్‌కు ఒకసారి, ఐసీడీఎస్ సరుకులకు ఒకసారి, మధ్యాహ్న భోజన పథకం బియ్యానికి ఒకసారి ఇలా ప్రతి నెలా మూడుసార్లు గోదామునకు వచ్చి వేలిముద్రలు వేయాల్సి వస్తోందని, అయినా మాకు రావలసిన కమిషన్ కొన్నేళ్ల నుంచి ఇవ్వడం లేదని రేషన్ డీలర్లు వాపోతున్నారు.

పోలీసు శాఖలో డ్రోన్ల పాత్ర కీలకం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ కాళీచరణ్

భీమవరం: పోలీసుశాఖలో డ్రోన్లు ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నాయని విద్యార్థుల్లో సృజనాత్మకత, సహకారం, ఆవిష్కరణలకు డ్రోన్ సాంకేతికత ఎంతగానో సహాయ పడతాయని భీమవరం టుటౌన్ సీఐ ఎం.కాళీచరణ్ అన్నారు. భీమవరం విష్ణు కళాశాలలో సోమవారం గరుడ ఇండియన్ హ్యాక్‌థాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు మాట్లాడుతూ హ్యాక్‌థాన్ పోటీల్లో వేరు వేరు కళాశాలలకు చెందిన 62 బృందాలు పాల్గొన్నాయన్నారు. అనంతరం డ్రోన్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల రెస్క్యూ టీమ్ సభ్యులకు రూ.లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెడికల్ డెలివరీ డ్రోన్ టీమ్ సభ్యులకు రూ.50 వేలను సీఐ కాళీచరణ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డ్రోన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కో-ఆర్డినేటర్ రంగారావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.శ్రీలక్ష్మి, సీనియర్ అసోసియేట్ మేనేజర్ జి.మారుతీ ప్రసాద్ యాదవ్, డీజే కిరణ్ గాబ్రియేల్, ఎస్.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో దాటవేత ధోరణి తగదు

సర్వ సభ్య సమావేశంలో కమిషనర్ తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం



నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: నగర పంచాయతీలోని సమస్యల్ని పరిష్కరించకుండా దాటవేత ధోరణితో కాలం వెళ్లదీస్తున్నారని కమిషనర్ కృష్ణమోహన్ తీరుపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన సమస్యలైన మంచినీరు, పారిశుద్ధ్యం, డంపింగ్ యార్డు వంటి వాటిని పట్టించుకోవడం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని కౌన్సిలర్లు వాపోయారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్లు నిమ్మల నాగు, మోటుపల్లి కుమారి, ప్రసన్న, గోపిశెట్టి సత్యవతి తదితరులు నగర పంచాయతీలోని పలు వార్డుల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్చడంలేదని, రా వాటర్ సరఫరా చేస్తున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. స్థానిక మాదివాడలోని అందేవారి బోదెలో నడక దారికి వేసిన తూరల తొలగింపుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను కౌన్సిలర్లు నాగు, కుమారి ప్రస్తావించారు. పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో పనులకు రాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని నాగు అన్నారు. స్థానిక 11వ వార్డులో, ధర్మాపుర అగ్రహారంలో మంచినీటి సమస్య ఉందని కౌన్సిలర్లు కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, కటికతల జాన్ వెస్లీ తెలిపారు. సమావేశంలో చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ పట్టణంలో మంచినీరు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారాన్ని కమిషనర్ తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. కమిషనర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకే అందేవారి బోదెలో అడ్డుగా ఉన్న తూరలను తహసీల్దార్ తొలగించారని చెప్పారు. ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్పిడికి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మూడు సార్లు నోటీసులు ఇచ్చినా పనులు చేపట్టడం లేదన్నారు. మరోసారి నోటీసు ఇచ్చి టెండర్ రద్దు చేస్తామని చెప్పారు. అజెండాలోని అలు అంశాల్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు దొడ్డి జగదీష్, గేదల అప్పారావు, జిల్లా పెద్దిరాజు, తిరుమారెడ్డి మాధవి, ఎండీ. అష్రఫ్ ఉన్నీసా, బొల్లా వీర శ్వేత, గుర్రాన నాగలక్ష్మి, బత్తుల శ్యామల, మోపిదేవిసత్యవతి, కోఆప్షన్ సభ్యులు మన్నే లలితాదేవి, గుండుగొల్లు సావిత్రి పాల్గొన్నారు.

2న ఏపీటీఎఫ్ తరగతులు

భీమవరం: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులు తాడేపల్లిగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9.30 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు-విద్యా రంగంపై ప్రభావం, విద్యారంగ సమస్యలు ఏపీటీఎఫ్ దృక్పథం-పని విధానం అనే అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయన్నారు. ఈ సమావేశానికి వక్తలుగా రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండు రంగ వర ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్‌రాజు హాజరవుతారని జిల్లా సబ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు, మండల, పట్టణ శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని ప్రకాశం, నారాయణ కోరారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

భీమవరం: పట్టణంలోని నర్సయ్య అగ్రహారానికి చెందిన మణికంఠ (30) లెప్రసీ కాలనీలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

కొత్త మద్యం పాలసీకి వ్యతిరేకం

ఆకివీడు: కొత్త మద్యం పాలసీకి సీపీఎం వ్యతిరేకమని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్వీ.గోపాలన్ చెప్పారు. స్థానిక 14వ వార్డుల్లో సీపీఎం జెండాను ఎగురవేసి పార్టీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం షాపులు పెంపు, సమయం పెంపు, బెల్టు షాపుల ఏర్పాటు వంటివాటికి తమ పార్టీ వ్యతిరేకించి ఉద్యమిస్తామని చెప్పారు. పాత విధానాల్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం హామీల అమలుపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సందక సూర్యకుమారి, ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పడింది. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, డోకల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలి

వీరవాసరం: మండల కేంద్రమైన వీరవాసరంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలుపుదల చేయాలని ఏపీ జన ప్రగతి సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల ప్రభాకర్‌రావు సోమవారం డిమాండ్ చేశారు. వీరవాసరం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ట్యాంక్ పోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారన్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి ట్యాంక్ పోరంబోకులో నిర్మిస్తున్న భవనాలను నిలుపుదల చేయాలని కోరారు.

బస్సు, కారు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాలకోడేరు: పెనుగొండ గ్రామానికి చెందిన విప్పర్ల వెంకట సత్యనారాయణ చిన్న అమిరంలో తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో పెద్ద కొడుకు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా సోమవారం ఉదయం వేంద్ర డెల్టా పేపర్ మిల్లు సమీపంలో వంతెన వద్ద ఎదురుగా వస్తున్న ప్రైవేటు కళాశాల బస్సును వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న సత్యనారాయణ కాలికి తీవ్ర గాయమైంది. చిన్న కొడుకు, కోడలికి గాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ హరిబాబు తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

భీమవరం: ఒక వ్యక్తి తన సోదరుడికి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బు తీసుకొని మోసం చేశాడంటూ భీమవరం 39వ వార్డుకు చెందిన మహిళ టూటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన పెద్దికృష్ణ మోహన్ అనే వ్యక్తికి భీమవరానికి చెందిన మహిళకు చిన్ననాటి నుంచి పరిచయం ఉంది. దీంతో కృష్ణ మోహన్ ఇన్‌స్టాగామ్ ద్వారా ఆమెతో మాట్లాడడం ప్రారంభించాడు. అది నమ్మిన మహిళ తన సోదరుడికి ఉద్యోగం కావాలని అడగగా, ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, రెండు దఫాలుగా రూ.1.08 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో ఆ మహిళ కృష్ణమోహన్‌ను నిలదీసింది. కృష్ణ మోహన్ డబ్బు ఇవ్వనని చెప్పడంతో ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రెహమాన్ తెలిపారు.

లక్ష్య సాధనకు ఉన్నతంగా చదవాలి



మధ్యాహ్న భోజనం రుచిచూస్తున్న కలెక్టర్ నాగరాణి



అంగన్‌వాడీలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

కలెక్టర్ నాగరాణి

ఉండి: జీవితంలో ఉన్నతంగా ఎదగాలి, అనుకున్నది సాధించాలంటే బాగా చదువుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. సోమవారం మహదేవపట్నం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, కిచెన్, పాఠశాల పరిసరాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూసారు. మధ్యాహ్న భోజనం సమయానికి పెడుతున్నారా, రుచిగా వండుతున్నారా?అంటూ విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదికి వెళ్లి ఉపాధ్యాయుల పాఠ్యాంశాల బోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నతంగా చదవి ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. మెనూ అమలుపై ఆరా తీశారు. చిన్నారులతో మమేకమై వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె పవన్‌కుమార్, ఉపాధ్యాయులు కలిదిండి రవికుమార్‌వర్మ, బొక్కా సుమలత, స్థానికులు సీతారామరాజు, వీఆర్వో చిన్నారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నందన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కాళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

ఉండి: పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జీ అన్నారు. సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఉండి మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాల్‌లో పోషణ్ మహ్ కార్యక్రమంలో భాగంగా ఏడు నెలలు దాటిన గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఉండి ఏరియా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పైడిమాల మేరీ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్లు పీ మేరీ,కే నాగలక్ష్మి, పీ నిర్మల, ఉండి అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

ఆకివీడు: ఆరోగ్య వంతమైన సమాజం కోసం పౌష్టికాహారం అందజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ప్రాజెక్టు అధికారిణి వి.వాణీ విజయరత్నం పౌష్టికాహారం ప్రాధాన్యత, ఆరోగ్య సూత్రాలు వివరించారు. గర్భిణులకు పండ్లు, చీర, జాకెట్, పసుపు కుంకుమ, గాజులతో సత్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రత్నకుమారి పాల్గొన్నారు.

ముగిసిన పౌష్టికాహార మాసోత్సవాలు

కాళ్ల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పౌష్టికాహార మాసోత్సవాలు సోమవారంతో ముగిసినట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్ కె.సూర్యకుమారి తెలిపారు. కాళ్లలో ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బందా విజయ, ఉప సర్పంచ్ పన్నాసి అబ్బులు. ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

పాలకోడేరు: నెల రోజులుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించామని ఐసీడీఎస్ సీడీపీవో వాణీ విజయరత్నం పేర్కొన్నారు. సోమవారం విస్సాకోడేరులో నిర్వహించిన ముగింపు ఉత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై గర్భిణులు, బాలింతలకు పలు అంశాలు వివరించారు. సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, నడిపూడి అప్పారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

IDBI BANK
60వ వ్యవస్థాపక దినోత్సవం
IDBI BANK
భీమవరం శాఖ
ఫోన్: 08816-236180, 1/2/3
15వ వార్షికోత్సవం
మా బ్యాంకు భీమవరం శాఖ 15వ వార్షికోత్సవం దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మరియు మా బ్యాంకు 60వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకుంటున్న శుభ తరుణంలో మాకు అన్నివిధాలా సహకరించిన మా డిపాజిటర్లకు ఖాతాదారులకు రైతులకు, వ్యాపారస్తులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.



బ్రాంచ్ మేనేజర్: కలిగినీడి విజయ్ కిషోర్ మరియు సిబ్బంది.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
79955 66351
90108 51166
Office mail : tpgadvt@gmail.com